క్లుప్తంగా

నివాళి

వేముల : మండలంలోని పెండ్లూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, నల్లచెరువుపల్లె సింగిల్‌విండో మాజీ అధ్యక్షుడు నాగేళ్ల ఈశ్వరరెడ్డి మృతదేహానికి పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురైన ఆయన కడప ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ మండల ఇన్‌చార్జి నాగేళ్ల సాంబశివారెడ్డి, జెడ్పీటీసీ వెంకటబయపురెడ్డి, మాజీ జెడ్పీటీసీలు మరక శివకృష్ణారెడ్డి, రాజారెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, గ్రామస్థాయి నాయకులు నివాళులర్పించారు.

విందుకు హాజరైన మాజీ ఎమ్మెల్యే


విందులో పాల్గొన్న పి.రవీంద్రనాథ్‌రెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్‌రెడ్డి

పెండ్లిమర్రి : మండలంలోని మమ్ముసిద్దుపల్లె గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మిరెడ్డి ఆదివారం ఏర్పాటు చేసిన విందుకు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే, పి.రవీంద్రనాథ్‌రెడ్డి, మాజీ ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ ఏ.మల్లికార్జునరెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పి.నరేన్ రామాంజులరెడ్డిలు హాజరైయ్యారు. ఈ సందర్భంగా వారు ప్రతి ఒక్కరిని అప్యాయంగా పలకరించి వైఎస్సార్‌సీపీ నాయకుల యోగ క్షేమాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ బాలయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యాక్షుడు శివశంకర్ రెడ్డి, మాజీ ఆగ్రో కార్పొరేషన్ డైరెక్టర్ చావలి శివ, మాజీ సింగల్ విండో అధ్యక్షుడు నాగేంద్రా రెడ్డి, ఎంపీటీసీ నాగమల్లారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు క్రిష్టారెడ్డి, వీరారెడ్డి పాల్గొన్నారు.

ఉచిత కంటివైద్య శిబిరం


కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

చక్రాయపేట : మండలంలోని నాగలగుట్టపల్లె జడ్పీ హైస్కూల్ వద్ద ఆదివారం తిరుపతి అరవింద్ కంటివైద్యశాల వారు ఉచిత కంటివైద్యశిబిరం నిర్వహించి వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. వారిలో 22 మందికి ఉచిత ఆపరేషన్ నిమిత్తం తిరుపతికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, సెక్రటరీ శశిశేఖర్, ట్రెజరర్ మహేష్‌రాజు, జిల్లా అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

బాల్యం నుంచే ధార్మిక చింతన

కడప ఎడ్యుకేషన్: బాల్యం నుంచే విద్యార్థులకు ధార్మిక చింతనతోపాటు మానవతా విలువలు నేర్పించాలని కడప జిల్లా అంజుమన్ తరఖ్ఖీ ఉర్దూ శాఖ అధ్యక్షుడు సత్తార్ ఫైజి అన్నారు. కడప నగరం నబీకోట మదరసా ఎ ఫైజానె మహబూబె సుబ్హానిలో ఆదివారం వేసవి శిబిరం నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ మత గురువు మహబూబ్‌ఖాన్ యూసుఫ్ ఆధ్యాత్మిక పుస్తకాలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో అమీర్ జమాఅత్ అబు ముబారక్, హాఫిజె ఖురాన్ మహమ్మద్ ఇమ్రాన్ పాల్గొన్నారు.

చీనీ మార్కెట్‌లో చెత్త తొలగేదెన్నడో..


మార్కెట్లో కుళ్లి పోయిన చీనీ కాయలు


మార్కెట్లో ఉన్న చెత్తా చెదారాలు

పులివెందుల రూరల్ : పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో ఉన్న వ్యవసాయ, చీనీ కాయల మార్కెట్లో ఎక్కడ చూసిన చెత్తా చెదారాలు దర్శనం ఇస్తున్నాయి. ఎక్కడ పడితే అక్కడే కుళ్లి పోయిన చీనీ కాయలు, చెత్త రోడ్డుపై పడి ఉంది. చీనీ కాయల మార్కెట్లో ఎక్కడ చూసిన మద్యం బాటిళ్లు కనిపిస్తున్నాయి. మార్కెట్ చాలా పరిశుభ్రంగా ఉండాలి. పులివెందులలో మాత్రం మార్కెట్ అంటే దుర్వాసన వస్తుందని మార్కెట్‌కు వచ్చే చీనీ వ్యాపారస్తులు, రైతులు, ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుళ్లి పోయిన చీన కాయలను అక్కడే రోడ్లపై పడేస్తుండటంతో వాటి నుంచి దుర్వాసన వెదజల్లుతుంది. అక్కడే రైతులు, మండి వ్యాపారస్థులు, కోనుగోలు దారులు, విక్రయదారులు, అధికారులు ఉంటారు. ఎవరు పట్టించుకోవడం లేదు. సంబంధిత మార్కెట్ అధికారులు ఉదయం నుంచి సాయంత్రం వరకు తిరుగుతూ ఉంటారు. కానీ మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచుదామన్న ఆలోచనలు వారికి రావడం లేదు. అనేక మార్లు చెప్పిన వారు పట్టించు కోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి మార్కెట్‌ను పరిశుభ్రంగా ఉంచాలాని రైతులు కోరుతున్నారు.

మావుళ్లమ్మ దేవతకు ఘనంగా పూజలు


మావుల్లమ్మ దేవతను దర్శించుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

చక్రాయపేట : మండలంలోని చిలేకాంపల్లెలో వెలసిన మావుల్లమ్మతల్లి దేవతకు ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. అలాగే కడప పార్లమెంటు సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి దర్శించుకుని అమ్మవారుకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం గ్రామానికి చెందిన పలువురు వైఎస్‌ఆర్‌సీపీ నేతలు ఏర్పాటు చేసిన విందు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అనంతరం ప్రజలు ఆయన దృష్టికి తీసుకువచ్చిన పలు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అనంతరం గండికొవ్వూరు గ్రామంలో వెలసిన కొవ్వూరు గంగమ్మ ఆలయానికి వెళ్లి అక్కడి అమ్మవారును దర్శించుకున్నారు. కుప్పం గ్రామ సర్పంచ్ గంగయ్య తన మనుమడి కేశఖండన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాధవీబాలకృష్ణ, ఎంపీటీసీలు కిరణ్‌కుమార్‌రెడ్డి, మోహన్ రెడ్డి, సర్పంచులు సురేష్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, సచివాలయ జేఏసీ కన్వీనర్ రామాంజులరెడ్డి, నేతలు శివారెడ్డి, ఆదిరెడ్డి, చిదంబరరెడ్డి, రమణారెడ్డి, బ్రంహానందరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు


పులివెందుల : ప్రత్యేక అలంకరణలో అమ్మవారు


విశేష అలంకారంలో గంగమ్మతల్లి

పులివెందుల రూరల్ : మండలంలోని అచ్చువెల్లి గంగమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని దిర్శంచుకునేందుకు కడప, కర్నూల్, అనంతపురం, చిత్తూరు, రాయచోటి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఆలయ అర్చకులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. ప్రతి వారం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారీ సంఖ్యలో వస్తుంటారు. ఆలయ అర్చకులు, నిర్వాహకులు భక్తులకు అన్ని సదుపాయలు ఏర్పాటు చేశారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : మండలంలోని కొత్తపేట గంగమ్మతల్లి దర్శనానికి ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. అర్చకులు అమ్మవారికి పట్టు వస్త్రాలు, గంధం, పసుపు, వేపాకు, నిమ్మకాయలు, పూలదండలు, తోమాలతో విశేష అలంకరణ చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని అభిషేకాలు, పూజలు చేసి తమ మొక్కుబడులను, ముడుపులను అమ్మవారికి చెల్లించుకున్నారు. అనంతరం బంధుమిత్రులతో కలిసి విందు భోజన కార్యక్రమాలలో పాల్గొన్నారు. అలాగే ఆలయ సమీపంలోని వీరభద్రస్వామి, శివాలయం, ఆంజనేయస్వామి దేవాలయంలో భక్తులు పూజలు చేశారు.

భద్రతా నియమాలపై సదస్సు

కడప ఎడ్యుకేషన్: రహదారి భద్రతా నియమాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని కడప ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జావిద్ పేర్కొన్నారు. కంబైన్డ్ యాన్యువల్ ట్రైనింగ్ క్యాంప్‌లో భాగంగా ఆదివారం రహదారి భద్రతా నియమాలపై ఎన్‌సీసీ క్యాడెట్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ జావిద్ మాట్లాడుతూ హెల్మెట్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, రహదారి సూచికలు, నియమాలపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులు, తమ చుట్టూ ఉన్న వారికి రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ క్యాంప్ కమాండెంట్ గ్రూప్ కెప్టెన్ ఆర్‌జే.ఆత్రే, ఎన్‌సీసీ అధికారులు కెప్టెన్. డాక్టర్. నీలయ్య, శివరాం, పసుపుల రాజశేఖర్, జగదీష్, సురేంద్ర నాయక్, అనిల్‌కుమార్, రూపేంద్రజిత్‌సింగ్, సీఏల్.రెడ్డి, కొండారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి పంపిణీ

పులివెందుల రూరల్ : ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను ఎమ్మెల్సీ రాంగోపాల్‌రెడ్డి ఆదివారం తన నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వివిధ కారణాలతో ఆసుపత్రులలో చెరిన వారికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి చెక్కలు మంజూరు చేయడం జరిగిందన్నారు.

వైభవంగా ముగిసిన జాతర

సింహాద్రిపురం : బైపాస్ రోడ్డులోని కొత్తచౌడేశ్వరి దేవి ఆలయం వద్ద ఆదవారం జ్యోతుల కార్యక్రమం వైభవంగా ముగిసింది. భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవరను పురష్కరించుకుని మండలంలో ఏర్పాటు చేసిన విందులో పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అనాథ మృతదేహాలకు అంత్యక్రియలు


అంత్యక్రియలు నిర్వహిస్తున్న మేబిహెల్ప్‌యూ సభ్యులు

జమ్మలమడుగు : మండలంలోని మోరగుడి గ్రామంలో ముప్పూరి వీరమ్మ, పళ్ల ఓబులమ్మలు అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. వీరికిబంధువులు ఎవ్వరు లేకపోవడంతో అంత్యక్రియలను మేబిహెల్ప్‌యూ స్వచ్ఛంద సంస్థ చేపట్టింది. మేబిహెల్ప్‌యూ పట్టణ అధ్యక్షుడు అహమ్మద్ హుస్సేన్, ఫౌండేషన్ చైర్మన్ లక్ష్మన్ మోరె నరేంద్రకుమార్, నక్కా గురుశేఖర్, కృష్ణాగ్ని తదితరులు వెళ్లి వారికి హిందు సంప్రాదాయం ప్రకారం అంత్యక్రియలను నిర్వహించారు. అలాగే ఎవరైన ప్రమాదాలు జరిగినప్పుడు రక్తం అవసరమైన వారికి తమవద్ద రక్తదానం చేసే వారున్నారన్నారు.

మే 20న దేశవ్యాప్త సమ్మెకు సంఘీభావం

కడప కల్చరల్: కేంద్ర ప్రభుత్వం అమలులోకి తెస్తున్న లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా మే 20న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఎల్‌ఐసీ ఉద్యోగుల సంఘం జోనల్ సంయుక్త కార్యదర్శి జి.తిరుపతయ్య పిలుపునిచ్చారు. కడప ఎసల్‌ఐసీ బ్రాంచ్ కార్యాలయం ఆవరణలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ వంద శాతం ఎఫ్‌డీఐ పేరుతో దేశంలోకి విదేశీ ఇన్సూరెన్స్ కంపెనీలను అనుమతించ బోతున్నారన్నారు. కొందరు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఆందోళనలకు తలొగ్గి పాత పెన్షన్ స్కీమ్‌ను అమలు చేస్తున్నాయని అన్నారు. పదవీ విరమణచేసిన వారి సంఖ్య పెరిగి కార్యాలయాల్లో నూతన నియామకాలు చేపట్టాలని కోరారు.

వంద మంది పిల్లలకు ఉచిత వడుగులు


వడుగులు చేయించుకున్న పిల్లలతో పీఠాధిపతి

జమ్మలమడుగు : అహలైబైత్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆస్థానయే గౌసియా కమిటీ ప్రతి ఏడాది నియోజకవర్గంలోని నిరుపేద ముస్లిం బాలురకు ఉచిత వడుగులు(ఖత్నా) కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఆదివారం పట్టణంలోని పలగాడి వీధిలో గౌసియా షాదీఖానాలో ఈ ఏడాది వంద మంది నిరుపేద బాలురకు ఉచిత వడుగులు చేసినట్లు ఆస్థానయే గౌసియా పీఠాధిపతి సయ్యద్‌షా గౌస్‌పీరాఖాద్రీ తెలిపారు. పీఠాధిపతి మాట్లాడుతూ ఖత్నా చేయించుకున్నవారికి జత బట్టలతోపాటు ఐదు కేజిల గోదుమపిండి, అర్థకేజి నెయ్యి, బెల్లం, కొబ్బర వంటి వస్తువులను ఉచితంగా అందజేశామన్నారు. కార్యక్రమంలో సయ్యద్ షా తాహీర్‌పీరాఖాద్రీ, అమీర్, ఆస్థానయే గౌసియా కమిటీ అధ్యక్షుడు మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

7న ప్రతిభా పురస్కారాలు

కడప ఎడ్యుకేషన్: ఇంటర్మీడియట్‌లో ఉత్తమ మార్కులు సాధించిన కడప జిల్లా పత్ర కులం విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందివ్వనున్నట్లు వీరగురుడు ఫౌండేషన్ నిర్వాహకుడు తిప్పన బ్రహ్మయ్య తెలిపారు. ఈ నెల 7న కడప జన చైతన్య సంఘం కార్యాలయంలో ఉదయం తొమ్మిది గంటలకు జరిగే కార్యక్రమంలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో 950 మార్కులకు పైగా వచ్చిన పత్ర కులం విద్యార్థులకు నగదు, మెమెంటోలు అందజేస్తామన్నారు. విద్యార్థులు తమ మార్కుల జాబితా, చిరునామా, ఫోన్ నెంబర్ 6303600328కు వాట్సాప్ ద్వారా పంపాలని కోరారు.

జలకాలాటలలో..


కాలువలో ఈత కొడుతున్న యువకులు

పులివెందుల టౌన్ : మండే ఎండలతో జనం బెంబేలెత్తుతున్నారు. మరో పక్క సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఇళ్లలో ఫ్యాన్లు తిరగుతున్నా ఉక్క పాతతో చెమటలు పడుతూ ఉడికి పోతున్నారు. వేసవి తాపానికి రకరకాల మార్గాలను వెతుకుతున్నారు. ఆదివారం పులివెందుల మున్సిపాలిటీలోని బ్రాహ్మణపల్లె గ్రామ శివారులో కాలువల్లో యువత ఈత కొడుతూ కనిపించారు. రకరకాల విన్యాసాలతో నీళ్లల్లో ఈతకొడుతూ ఉత్సాహంతో కేరింతలు కోడుతున్నారు. అలాగే చిత్రావతి బ్యాలెన్స్ రిజర్వాయర్ నుంచి లింగాల కాలువలకు నీరు వదలడంతో యువకులు సరదాగా ఈత కోడుతున్నారు. ఆదివారం కావడంతో యువత ఎంజాయ్ చేశారు. కాలువుల వద్దకు వెళ్లె సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది.

ఘనంగా భగీరథుడి జయంతి


పులివెందులలో భగీరథుడికి నివాళులర్పిస్తున్న సగర సంఘం నాయకులు


భగీరథ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సగర సేన రాష్ట్ర అధ్యక్షుడు జనార్ధన్ తదితరులు

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీ భగీరథ సగర సంఘం (ఉప్పర) ఆధ్వర్యంలో ఆదివారం భగీరథుడి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ పరిధిలోని శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి (పాత మార్కెట్) ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భగీరథుడి చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సగర సంఘం ప్రెసిడెంట్ ధర్మవరపు ఓబులేసు, వర్కింగ్ ప్రెసిడెంట్ పప్పూరు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శి పూజనబోయిన నాగేశ్వరరావు, కోశాధికారి బ్రహ్మయ్య, జాయింట్ సెక్రటరీ నాగేంద్ర బోస్ తదితరులు పాల్గొన్నారు.

తొండూరులో..

తొండూరు : బూచుపల్లి గ్రామంలోని బీసీకాలనీ రామాలయంలో భగీరథ జయంతి సందర్భంగా సగర సేన రాష్ట్ర అధ్యక్షుడు జనార్ధన్ భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భగీరథుని కులస్తులకు రాజకీయంగా అన్ని పార్టీల కమిటీలలో సముచిత స్థానం కల్పించి సగర ఉప్పర కులస్తులకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సగర సంగం సభ్యులు పాల్గొన్నారు.

రేపటి నుంచి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం


రామాలయం

వేంపల్లె : బొడ్డురాచన్న వీధిలో నూతనంగా నిర్మించిన శ్రీ హనుమంత్ సమేత సీతారామలక్ష్మణ ఆలయంలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం మంగళవారం నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. 6వ తేదీ ఉదయం యాగశాల ప్రవేశం, కలశ స్థాపన, పుణ్యాహవాచనం, 7వ తేదీన గణపతిపూజ, వేదపారాయణం, హోమాలు, అభిషేకాలు, 8న పాతాకలపూజ, విగ్రహ ప్రాణ ప్రతిష్ఠ, గోదర్శనం, పూర్ణాహోతి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేస్తారన్నారు. సర్పంచ్ రాచినేని శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


అప్పటి గురువులతో పూర్వ విద్యార్థులు

తొండూరు : స్థానిక ఉన్నత పాఠశాలలో 2003–04 విద్యా సంవత్సరం పదవ తరగతి చదువుకున్న విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమ్మేళనంలో కలుసుకున్నారు. నాటి విద్యార్థి కృష్ణారెడ్డి అధ్యక్షతన ఈ కార్యక్రమం నిర్వహించారు. పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్దులు నేర్పిన గురువులను సన్మానించి సంబరపడ్డారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకుంటూ బాగోగులు అడిగి తెలుసుకున్నారు. ఆనాటి రోజులను గుర్తుకు తెచ్చుకుంటూ నవ్వుల సంద్రంలో మునిగి తేలారు. పెద్దలంతా పిల్లలుగా మారి సందడి చేయడం గురువులను కూడా సంతోష పరిచింది. ఈ కార్యక్రమంలో 60 మందికి పైగా విద్యార్థులు, వారి కుటుంబ సభ్యులతోపాటు నాటి గురువులు పాల్గొన్నారు

మధుర ఫలం.. విషతుల్యం

- పండ్లను మాగబెట్టేందుకు రసాయనాల వినియోగం
- ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్న కెమికల్స్
- రైపనింగ్ చాంబర్ల ఏర్పాటు పట్ల ఆసక్తి చూపని రైతులు



విక్రయానికి సిద్ధంగా ఉన్న మామిడిపండ్లు


మాగబెట్టిన అరటి కాయలు

రాయచోటి జగదాంబ సెంటర్ : ఆహారంలో పండ్లకు అధిక ప్రాధాన్యం కలదు. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెరిగిన నేపథ్యంలో రోజువారీ ఆహారంలో జామ, బొప్పాయి, దానిమ్మ, కమలా తదితర పండ్లను తీసుకుంటున్నారు. వైద్యులు, న్యూట్రిషియన్లు సైతం పండ్లు, గింజల నానబెట్టిన సీడ్స్‌ను తినండంటూ అవగాహన సైతం కల్పిస్తున్నారు. శాఖాహారం తీసుకునేవారు రోజు మొత్తంలో పండ్లను ఎక్కువగా భుజిస్తారు. తినే పండ్లలో ఆరోగ్యశాతమెంతన్న ప్రశ్న వినియోగదారులను వేధిస్తుంది.

అరటి, మామిడి పండ్ల విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. మార్కెట్లో పండ్లను మాగబెట్టేందుకు కాల్షియం కార్బైడ్ తదితర రసాయనాలను వినియోగిస్తుండటంతో ఫలాలు విషతుల్యమవుతున్నాయి. పోషకాలతో పాటు విషపదార్థాలు శరీరంలోకి వెళ్లడం ద్వారా ఆరోగ్యం దెబ్బతింటోంది. ఈ విషయమై జిల్లా స్థాయిలో ఇటీవలే అన్నమయ్య జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ్ రాజేంద్రన్ పండ్ల వ్యాపారస్తులతో సమావేశమై పలు సూచనలు, సలహాలను చేశారు.

రసాయనాల వినియోగం ఇలా..

ఉత్పత్తి అయిన వ్యవసాయ క్షేత్రం నుంచి వినియోగదారుడికి పండ్లు చేరే మధ్యలో మార్కెట్ కీలకమైనది. పండు చెట్టు మీదనే పరిపక్వతకు వచ్చాక తినడమనేది దాదాపు సాధ్యం కాదు. పచ్చిగా ఉండగానే వాటిని ప్రకృతి సిద్ధంగా మాగబెట్టి మార్కెట్‌లో విక్రయించాల్సి ఉంది. అయితే సమయానుకూలత వల్ల దళారులు రసాయనాల వినియోగం ద్వారా పండ్లను మాగబెడుతున్నారు. మామిడి పండ్లకు కాల్షియం కార్బైడ్, అరటికి ఇథెఫాన్ లిక్విడ్‌లను స్ప్రే చేస్తున్నారు. ఈ ప్రక్రియ అంతా మార్కెట్‌కు, రైతుకు మధ్య ఉన్న దళారీలే చేస్తున్నారు.

సహజసిద్ధంగా పండిన పండును గుర్తించండి ఇలా..

సహజ సిద్ధంగా మాగిన మామిడిపండ్లు కొంత పసుపు, మరికొంత ముదురు ఆకుపచ్చ రంగులో ఉండి పండు లోపలి భాగం అంతా పరిపక్వత చెంది ఉంటుంది. కమ్మని వాసనను మనం దూరంగా ఉన్నప్పటికీ గ్రహించగలుగుతాం. సహజసిద్ధమైన తీపి ఎక్కువగా ఉంటుంది. రసాయనాలతో మాగించిన పండు మొత్తం ఒకే విధమైన కాంతివంతమైన లేత పసుపు కలిగి ఉంటుంది. పైకి మాగినట్లు కనిపించినా లోపల అపరిపక్వంగా ఉండి పుల్లగా ఉంటుంది. కమ్మని వాసన ముక్కు దగ్గర ఉంచినప్పుడు మాత్రమే వస్తుంది. తక్కువ తీపి ఉంటుంది.

విజిలెన్స్ దాడులు

పండ్లను రసాయనాలతో మాగబెట్టి అమ్మడంపై విజిలెన్స్ శాఖ దాడులు నిర్వహించి కేసులను నమోదు చేస్తుంది. రసాయనాలు వినియోగించారా లేదా అనేది ఉద్యానశాఖాధికారులు నిర్ధారించగా సంబంధిత అధికారులు చట్ట పరిధిలో చర్యలు తీసుకుంటారు. పండ్లు విషతుల్యం కాకుండా ఉండేందుకు ప్రకృతి సిద్ధమైన రైపనింగ్ చాంబర్లలో పండ్లను మాగబెట్టి విక్రయించడం మేలు.

ఆరోగ్య సమస్యలు వస్తాయి



కాల్షియం కార్బైడ్‌ను కేంద్ర ప్రభుత్వం నిషేధించింది. దాంతో మగ్గబెట్టిన పండ్లు తినడం వల్ల జీర్ణ సంబంధిత సమస్యలొస్తాయి. రోజూ పండ్లు తినే వారు సహజసిద్ధంగా పండించిన పండ్లు తినడం మేలు. ప్రత్యామ్నాయంగా ఎథిలిన్ హార్మోన్ స్ప్రే చేయొచ్చు. రైపనింగ్ సెంటర్లు ప్రయోజనకరంగా ఉంటాయి.

– వనిత బాయి, ఉద్యానవన, శాఖాధికారి, రాయచోటి